ఊ. ~~243~~

210/7A

1186/4

సం॥ పుటము 33
తారణ సం॥
1944-45

(33)

5854

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)



కాకినాడ:

తారణనామ సంవత్సరము.

సంపుటము ౩౩

1944—45.

తారణనామసంవత్సరము

విషయసూచిక.

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము ౩౩. { తారణ చైత్ర-భాద్రపదములు. } సంచిక ౧-౨-౩-౪

స్వవిషయము.

తారణసంవత్సరముతోఁ బరిషత్పత్త్రికకు ముప్పదిమూఁడవసంపుటము ప్రారంభింపఁబడుచున్నది. యుద్ధపరిస్థితులవలనను, పత్త్రికాప్రకటనమును గూర్చి దొరతనము వారు ప్రచురించుచున్న యుత్తరువులవలనను బత్త్రికను బూర్వమువలె హెచ్చుపుటలతోఁ బ్రకటించుటకు వీలు కలుగనందులకుఁ బాఠకులు క్షమింతురుగాక. ఆయుత్తరువులు మార్పు చేయఁబడినతోడనే యథాప్రకారముగఁ బత్త్రిక ప్రకటింపఁబడు నని మనవి చేసికొనుచున్నాము.

ఇటీవల సారస్వతప్రపంచమునఁ గలుగుచున్న మార్పు లత్యధికముగ నున్నవి. నవలలు, చిన్నకథలు, ఖండకావ్యములు నెక్కువగఁ బ్రజాదరమును గాంచుచున్నవి. ప్రాచీనగ్రంథములరీతిని మునిత్రయచరిత్రము, అష్టావక్రచరిత్రము మొదలగు ప్రబంధములును విరళముగఁ బ్రకటింపఁబడుచున్నవి. నవలలయందును, కథలయందును నుపయోగింపఁబడుచున్న భాష నేఁటికిని నియమరహితముగ స్వచ్ఛందమార్గములఁ జరుచుండుట కడు శోచనీయము. కాలక్రమమున సుసంస్కృతము, సులభము,

జనాహ్లాదకమునగు భాషాశైలిని కవులు, పండితులు, కథారచయితలు నుపయోగింతురని యాశించుచున్నాము.

సుప్రసిద్ధవైయాకరణపండితులును మహామహోపాధ్యాయ కళాప్రపూర్ణ బిరుదాంకితులు నగు బ్రహ్మశ్రీ తాతా సుబ్బరాయ శాస్త్రివర్యులును, విజయనగర కళాశాలాసంస్కృతోపన్యాసకులును నిరంతర భాషాసేవాధురంధరులు నగు శ్రీ మేడేపల్లి వేంకటరమణాచార్యులు వారు నిటీవలఁ గాలధర్మమునందుటచే నాంధ్రసారస్వతలోకమునకు గొప్ప లోటు వాటిల్లినది. వీరు మాననీయులై తమశిష్యపరంపరచేతను, అఖిలాంధ్రవిద్వజ్జనసంఘముచేతను బ్రశంసింపఁబడుచుఁ దమ ధన్యజీవితము గడపిరి. వీరి నాదర్శముగఁ గైకొనుచు పాండిత్యము, భాషాసేవ నలవఱచుకొని యువకులు సాహిత్యప్రపంచమున నిరంతరకృషి సలుపుదురు గాక.

నిఘంటు కార్యాలయమున నిఘంటురచనాదికములు యథాక్రమముగ సాఁగుచున్నవి. శ్రీశ్రీశ్రీ పీఠికాపురాధీశ్వరుల కార్యదీక్షచే నాల్గవసంపుటము (తవర్గాంతమువఱకు) వెలువడినది. అచిరకాలముననే మిగిలినవికూడ ముద్రితములై గ్రంథము సంపూర్తి నొందఁగలదు. గ్రంథముద్రణమునకు, బైండింగునకు వ్యయ మధికమైనను, భాషాభిమానుల కందుబాటులో నుంచుటకై సంపుటములు పూర్వమువలె తక్కువ వెల కీయఁబడుచున్నవి. ముద్రితసంపుటములను బండితులు, గ్రంథాలయాధికారులు, భాషాభిమానులు నితోఽధికముగఁ గొని పరిషత్కార్యనిర్వహణమునకుఁ దోడ్పడఁ గోరుచున్నాము.

కళాపూర్ణోదయము- పండితాభిప్రాయము.

శ్రీశ్రీశ్రీ పీఠికాపురాధీశ్వరులు పింగళిసూరనార్యకవివరేణ్యుని కవితావిశేషమునఁ దమకుఁగలయాదరాభిమానములచే నిటీవల బ్రహ్మశ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రులవారి సంపాదకత్వమునఁ బ్రచురింపించి సాదరముగ మా కొసంగిన కళాపూర్ణోదయప్రబంధరత్నము నామూలాగ్రముగఁ బఠించి యమందానంద మందితిమి.

ఈవఱకుఁ బలుమాఱు నీమహాకావ్యము ముద్రితమై యున్నను వివిధములగు స్ఖాలిత్యములతో నిండి పెక్కుతావులఁ గవిభావములను స్పష్టపఱుపఁజాలకుండినది. ఆకొఱఁత తీర్పఁబూనిన శ్రీవారి ప్రయత్న మీముద్రణమున సర్వథా సఫలమైనది.

పూర్వముద్రణములందలి సందిగ్ధపాఠములు యతిభ్రంశములు మున్నగు పెక్కుదోషము లీముద్రణమున మేలుప్రతుల సహాయమున సరసముగ సంస్కరింపఁబడినవి. ఉదాహరణముగఁ గొన్ని లక్ష్యముల మాత్ర మీక్రిందఁ జూపుచున్నాము.

"కృతి దురావమొదవుఁ గీర్తియుఁ బాలు నీ
కుంటగాదు హాసరోమాగ్యుఁ జేయు" అని ముద్రితము లన్నిటను గలదు.

"కృతియుఁ దాఁపుమొనవుఁ గీర్తియుఁ బాలు..." (౧. ౯) అని క్రొత్తప్రతిపాఠము. ఇది అన్వితము.

"వినరే యెవ్వరు పాపం
బనఁ బుణ్యంబన నిషేధమన విధియన గీ
డన మేలనఁ బరలోకం
బన......" అని ముద్రితములన్నిటను గలదు.

“...క్తీ, డన మేలన గ్రహమనఁ బర, మనఁ దలఁపఁగ లేరుగాక...
(౨. ౧౦౭) అని సరసమగుపాఠమును క్రొత్తప్రతి చేకొన్నది.

“అందముగాఁగఁ గంటట ఘనాఘనకాలము చాలనొప్పెని
ర్ద్నిందిత గంధబంధనవనీవవనీకమనీభవన్ని జేం
దిందిరబృందము త్తనళినీమలినీభవనాగతారసా
స్పందజగత్పలిద్ఘ్నగయశాయిరయాయిమరాళజాలమై”

“యాయ మరాళజాలమై”

“మలినీభవనాగనాగనాస్పందజగుత్పలద్ఘ్నగయశాయిలయాయిల మరాళజాలమై” అని ముద్రితప్రతులలోని పాఠములు.

“...ఘనాగమకాలము......

“భవనాగతారసా, స్పందజగుత్పలద్ఘ్నగయశాయిలయాయిమ రాళజాలమై (౭. ౧౭౮) అని క్రొత్త ప్రతిపాఠము.

“హేమంతం బంత సంతర్పితకమలబలోదీతపిస్ఫీతశీత
త్రామాత్మస్వామిధామక్రమణకృశపిపూర్ణ ప్రవిశ్రాణితాతి
శేమప్రేమప్రకామశ్రితరతముదితశ్రీముఖవ్యూహ...”

“క్రమణ కృశవపుర్ణ ప్రవిశ్రాణిత” అని ముద్రితపాఠములు సందిగ్ధముగా నున్నవి.

“త్రామాత్మ స్వామిధామక్రమణకృశవపుర్ఘ్న ప్రవిశ్రాణితాతి... యామినీల హెచ్చువచ్చెన్” (౭-౧౮౪) అని నూతన ప్రతిపాఠము.

యతిభంగములు.

కం. జృంభిత తద్రోవభావ వినఁబడసంటెన్. అని ముద్రితముల న్నిటను గలదు.

“జృంభితతద్రోవభావ చెవిఁబడు సంటెన్ (౫-౫౭) క్రొత్తప్రతి.

చ. అసదృశభూషణాన్విత విలాస విచిత్రత...అని ముద్రితము లన్నిటను గలదు.

"లసదురుభూషణాన్వితవిలాసవిచిత్రత... అని నూతనప్రతి.

చ. బెదరుట లేక మైమఱపదిసేయక పోరిరి..." అని ముద్రితము లన్నిటను గలదు.

"చెదరుట లేక మైదువదిసేయక పోరిరి..."అని నూతనప్రతి పాఠము. ఇట్లే పెక్కులుగలవు.

ఇక్కవిసార్వభౌమునికవితాచమత్కృతులఁగూర్చి శ్రీవారు విపులమగు పీఠికను గూర్చుట బంగారమునకుఁ బరిమళమబ్బినట్లు సమకూడినది.

ఇట్టి నిర్దుష్టములగు పాఠములను సంపాదించు సందర్భమున శ్రీ సుబ్బయ్యశాస్త్రిలవారు కావించిన ప్రయత్నము శ్లాఘాపాత్రము. ఆంధ్రభోజులగు శ్రీ మహారాజావారిట్టి యమూల్యప్రబంధ రత్నములఁ బ్రచురింపించి యాంధ్రసారస్వతమున కత్యధికాభ్యుదయము గలిగింతురుగాక.

ఇట్లు,

నిఘంటు కార్యాలయపండితులు.

గ్రంథస్వీకారము.

1 భార్గవీశతకము:- ఏలేయల్లయకవి ప్రణీతము-(నైజాం భువనగిరి తాలూకా శిరిపురము) గ్రంథమునకు కవి కష్టోత్తరములు అను నామాంతరమే యందలి విషయమును సూచించును-కవుల కష్టములు నేఁటివి కావు-లక్ష్మీ సరస్వతులవిరోధ మనాదినుండి వచ్చుచున్నది-అయినను కవులు పరితాపమునొందక తమ కవితాప్రపంచమును స్వేచ్ఛావిహారమొనర్పవలసియున్నది.

2 విక్రమప్రకృతి:- భాషాప్రవీణ యామిజాల పద్మనాభస్వామి విరచితము-జయపురాధీశ్వర విక్రమదేవవర్మమహారాజులుగారి కంకితము. జయపురాధీశ ప్రకృతిసౌందర్యములకు, ముగ్ధుఁడై కవి రచించి శ్రీవారికి కానుగానొసఁగిన 116 పద్యముల సంపుటము గ్రంథకర్త శ్రీతిరుపతి వేంకటకవీశ్వరుల శిష్యుఁడు. జయపుర రాజ్య ప్రజలసత్ప్రవర్తనములు, భిల్లజాతుల ముగ్ధత్వసౌందర్యములు, ప్రకరణానుగుణముగ వర్ణితములు. బస్సు, డ్రైవరు, పికారు మున్నగు నవ్యదేశీయపదము లుపయోగింపఁబడినవి. కవిత్వము రమణీయమై సులభముగనున్నది.

3 పాణినీయము:- కావ్యవాఙ్మయము. బ్రహ్మశ్రీ ఉభయభాషాప్రవీణ వ్యాకరణ విద్యాప్రవీణ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి గారిచే రచింపఁబడిన భాషావిమర్శ పరిశోధక వ్యాస సంపుటము.

ఇందలి వ్యాసములు మూఁడుభాగములుగ విభజింపబడినవి. (1) పాణినీయ పరిశోధనము (2) మహాకవి ప్రయోగసాధనము (3) అనుబంధ పరామర్శము. సుప్రసిద్ధవైయాకరణులగు శ్రీవఝ్ఝలచినసీతారామశాస్త్రిగారు తమ చింతామణివిమర్శపరిశోధనమును సంస్కృత వైయాకరణులనుగూర్చి వ్రాయుచు పాణిని కాలమునాఁటికి వ్యావహారికభాష, వేదభాష, శిష్టవ్యవహారభాషయని భాష మూఁడు తెఱఁగులుగ నుండె

ననియు నందు శిష్టవ్యవహారభాషకే మునిత్రయమువారు వ్యాకరణమును రచించిరనియు, భారత రామాయణాది కావ్యములఁగల భాషకు వారను శాసనముల రచింపలేదనియు, సూత్రములను వ్యవహారభాషలో రచించి రనియు నిత్యాదిగ వ్రాసియుండిరి. అవి శ్రీ గిడుగువారి సంప్రదాయానుగుణ్యముగ నుండునటుల వ్రాసిన విషయములుగాని భాషాస్వరూపమును, వ్యాకరణ రచనావిధానములను తిరస్కరించి వ్రాయఁబడినవిగావు. ఆ యావిషయములను తీవ్రముగ సక్రమముగ గ్రంథకర్తలు విమర్శించి యీ గ్రంథమునందలి వ్యాసముల రచించిరి. పాణిన్యాది వైయాకరణులు గ్రంథస్థమగు కావ్యభాషకే యనుశాసనమొనర్చి రనియు నందు పెక్కు ప్రయోగములఁగూడ సాధించిరనియు, మహాకవుల ప్రామాదిక ప్రయోగములని భ్రమించువానిని పెక్కిటిని మహాభాష్యాది గ్రంథములందును వ్యాఖ్యానములందును సమర్థించి యుండిరనియు, భాషను శిష్టవ్యవహారము వ్యావహారిక మని విభజించుట పొరపాటనియు వీరు నిరూపించి యున్నారు. ఇందలివిషయములు భాషాశాస్త్రమున కత్యంతోపయోగములు. వ్యవహారము శిష్టవ్యవహార మనఁబడుభాష గ్రంథస్థమగు భాష కాదనియు, నట్టిభాషకు వైయాకరణు లనుశాసనముల రచింపలేదనియు నీగ్రంథమునందలి సారాంశము.

4 షడ్దర్శన సంగ్రహము: మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు, పల్లిపాలెము. కాకినాడ, తా.

ఇది హరిభద్ర సూరికృతమగు శ్లోకరూప గ్రంథమునకు మృదు మధుర మగువచనానువాదము. ఇందు బౌద్ధ నైయాయిక సాంఖ్య జైన వైశేషిక జైమినీయ చార్వాకము లనుదర్శనములపై సంగ్రహచర్చ కలదు. ఇదివఱకు నచ్చటచ్చటఁ బ్రత్యేకముగ దర్శనవిషయములు పలువురచేఁ బ్రకటింపఁబడినవి. కాని గ్రంథాకారములో నున్నవి విరళము. ఏకత్ర నిరూపించుటయే శాస్త్రిగారి యుద్దేశము. దార్శనికవిషయములు గాన నింతకంటె విపులీకరించిన నుపయోగముగ నుండును.

5 వేలుపుటావు:- ప్రాప్తిస్థానము. జి. వెంకటేశ్వరరావుగారు, జాంద్రపేట, చీరాలపోష్టు, బాపట్లతాలూకా.

ఈచిన్నికావ్యము మధురకవి గొరాబత్తుని వేంకటేశ్వరరావుగారిచే రచింపఁబడినది. ఈకథావస్తువు భారతమరణ్యపర్వము ప్రథమాశ్వాసమునుండి గైకొనఁబడినది. అఱువది పద్యములలో ముగించినారు. చక్కనిశైలిలో రచనము సాఁగినది. వెల. 6 అణాలు.

6 భాగ్యలక్ష్మి—ఇదియొక ఖండకావ్యము. ఇదియు మధురకవిగారి రచనయే. ఇందలి విశేషము ప్రాచీన నవీనములగు పద్ధతుల స్వాయత్తీకృత మొనర్చుకొనుటయే. ఇందు నాయికానాయకుల సౌందర్యవర్ణనమున ప్రబంధశైలి కానవచ్చుచున్నది. నాయికా నాయకుల ప్రేమావిష్కరణముల భావకులభంగిమ కానవచ్చుచున్నది. అచ్చటచ్చట 'ఉమర్ ఖయ్యామ్' రుబాయతులను తలఁపించు పద్యములు కూడఁగలవు. కవిత్వమునుగూర్చియు శైలినిగూర్చియు పీఠికాకర్తలు వ్రాసిచ్చినది యతిశయోక్తియనఁ జెల్లదు. వెల 13 అణాలు.

7 భారతీసాక్షాత్కారము:- వాజపేయయాజుల రామసుబ్బరాయఁడు. స్నేహలతాకవితాసంఘము, కొల్లాపురము.

ఇది భారతీదేవినిగూర్చి రెండువందల పద్యములలోఁ జేసిన స్తోత్రగ్రంథము. కవిత ధారాళముగా నున్నది. ఆయాప్రాచీనాంధ్రకవులు చేసిన భారతీస్తోత్రపద్యములుకూడ నిందు పొందుపఱుపఁబడినవి. ఈకృతి శ్రీసురభి వేంకటరత్నమాంబా మహారాజ్ఞీమణికి నంకిత మీయఁబడినది. స్నేహలతాకవితాసంఘమును, ఈకవిగారిని బరిచయము చేయుట సిద్ధసాధనము.

8 గాయత్రీతారావళి:- గ్రంథకర్తలు పైవారే. ఇది ౨౭ పద్యములలో రచింపఁబడిన గాయత్రీజప ప్రాముఖ్య ప్రకటనగ్రంథము.

—

వి జ య వి హా ర ము

వ్యాకరణవిద్యాప్రవీణ, విద్వాన్, చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఉ. ద్వైతవనంబులో విబుధవంద్యులు పాండవు లాత్మనిష్ఠ ని
ర్ధూతకదధ్వఖేదులు వధూమణితో వసియించుచుండ, నా
పూతచరిత్రు లా మునులపొందున సర్వసుఖైకమూలముల్
వీతవికారబుద్ధిఁ గురువీరుఁడు గైకొన ధర్మనిష్ఠతన్. ౧

ఉ. అంతట వార లావని నిరంతరశాంతి వెలుంగుచుండ, వే
దాంతవిహారలాలసు మహాత్ముని సాత్యవతేయుఁ గాంచి, య
త్యంతము భక్తిఁ దన్మునిపదాంబుజహారి నఖాగ్రనిస్సర
త్కాంతిలతాంతముల్ జడలఁ దత్పరతన్ ధరియించి రందఱున్ ౨

ఉ. తాపసయూథనాథుఁడు సుధారసపూర్ణకవిత్వయుక్తుఁ డా
ద్వీపజుఁ డాత్మజన్మపదవిన్ వెసఁ జేరఁ బరాభవోష్మసం
తాపితు లైనవారలు నితాంతజలస్రుతి దాల్చి రక్షులన్
దీపితవృష్టిఁ దేలవొకో? దేశము సత్కవి స్వాతిఁ జేరినన్. 3

ఉ. మౌనివతంసుఁ డెంతొ బహుమానముతో నిడె విద్య నొంకు, స
మ్మానితకీర్తి ధర్మజుఁడు మక్కువ మీఱఁ గవుంగిలించి, స
మ్మానముతోడఁ బంప పరమం బగునస్త్రము పొందఁగా హిమా
నీనగయాత్ర సల్పె గుణనీరధి పార్థుఁడు నెమ్మిఁ గొల్వఁగన్. ౪

చ. హిమము ఘనీభవించి చలి హెచ్చుగ దేహము నొంచుచుండ నా
హిమగిరిఁ గాఁపురంబు వెలయించెడియక్షనికాయ మెల్లయుం
గములు మనోజ్ఞ మై తనరఁగాఁ దనుమధ్యలపెద్దవానుకో
జముల సఖింపచోష్ణములఁ జక్కఁగ సేవ యొనర్తు రెప్పుడున్. ౫

శా. గోరూపంబును భూమి దాల్ప, పృథువున్ గోపాలుఁ డై పూన, నే
పారం గోమలవత్సభావమున స్వాయమ్నూత్నరత్నప్రభా

పూరతక్షీరము చక్కఁగ్రోలి, భర మై పొంగారఁగా నిన్నర
త్సారంబట్టు మనశ్శిలార్ఘకుల నాశైలంబు మించెం దగన్. ౬

గీ. బలిమిఁ బర్వత మెక్కఁగా పార్థునాన
నాబ్జమునఁ బొల్చు స్వేదకణాళిమధువు
పిల్లవాయువు గ్రోలి శోభిల్లఁజేసె
భ్రమరభావము తన కెంతొ భాసురముగ. ౭

చ. జగములతల్లిదండ్రులు నజస్రము నొండొరు వీడ కుండఁగా
మగఁడును నాలి నై పొలుచుమంగళరూపము దాల్చినార లీ
యుగమున నత్తఱంబు చెలు వందఁగఁ జేసినకారణంబునన్
నెగడెడు మేము నట్టు లవి నిత్యము మ్రొక్కెడిమానులం గనెన్. ౮

క. నగజాత మగనిఁ గోరుచు
నిగమాంతరచారిమానినికరము నలితమున్
నెగడొందఁ దపము నల్పిన
నగమధ్యస్థితతపోవనంబుం జూచెన్. ౯

ఉ. మృగవృషభంబు డగ్గఱిన మేఁతను గానుక నీయనో యనన్
పిడికెఁడుదర్భఖండములు ప్రీతి భుజించుచు నెల్లవేళలన్
కడఁగి మనంబు నీశపదకంజములందుఁ దిరంబు చేసి య
ప్పుడు దొడఁగె న్మహామతి తపోనియమంబును బార్థుఁ డర్థిమై. ౧౦

చ. వివిధతపోవిశేషపదవీస్థితిఁ దాఁ దరాతివిర్జితం
బవని యటంచు పాదయుగమంతయు మోఁపఁగఁ గొంకువాఁడునాన్
భువిని బదాగ్రమాత్రమునఁ బొల్చి, చలింపక యించుకేనియుం
బ్రవిమలనిష్ఠ దోర్పడఁ దపం బొనరించెను నిమ్మరంబుగన్. ౧౧

ఉ. భానుఁడు తీవ్రతేజమున ఫాలతలంబు తపింపఁజేయ, న
మ్మానితతేజుఁ డాకిరణమధ్యమునం దనదృష్టి నిల్పె; నై
శ్వానరుఁడుం గిరీటి నలువంకలఁ జుట్టఁగ నొప్పె; భక్తికై
కానన మొందు కోరి పదకంజములం బడి వేఁడువాఁడునాన్. ౧౨

ఉ. వాసవినామసామ్యమున బాంధవ మేర్పడియుంటనేమొ యు
ద్భాసితు నాధనంజయుని పార్శ్వములం దగఁ గూర్చె; నట్టులా
రా! సృజియించి తంగవిషయాధిపు వైరిగ నా కటంచు బల్
కోపము దాల్చె నాన్ ఖరకరుం బరికించుము తీక్ష్ణదృష్టి నైన్. ౧౩

ఉ. వ్యాసమునీంద్రుఁ డర్జునుఁ గృతార్థునిఁ జేయ మహోపదేశముం
జేసినమంత్రభాగములఁ జిన్మయు శంకరు నంతరంగమం
దాన భజించి, యానియతి నందఱ మానులఁ గ్రిందుసేయ సం
తోసముఁ బూనెనో యనఁగ దొంతర లౌజడ లూనె మౌళిపై. ౧౪

గీ. ఓలి ఫలపర్ణ వాయువు లోగిరముగ
సీకరించుట విడువ నాశీలధనుని
యత్నగుణ మెల్లవేళఁ గరాగ్రమందె
లోల మయ్యెను విషయముల్ గ్రోల దయ్యె. ౧౫

ఉ. అంతటనిష్ఠతో నతఁ డహర్నిశముం దరుణేందుమౌళి న
త్యంతదయార్ద్రచిత్తు ననయంబును నాత్మవశం బొనర్ప నా
వంతయు భూతలంబునఁ బదాగ్రము మోపియు బాహులెత్తు చొ
ప్పెంతయు వింతగూర్చ నిటు లీతఁడు మాఁదిఫలంబు లందువాన్. ౧౬

చ. అనిలవిరోధ మేర్పడఁగ నబ్బుర మాతప మాచరించువ
ర్జునుశిరమందుఁ బుట్టి మిను సోఁకఁగ నల్గడలంకుఁ బర్వి యే
చినవికటస్ఫులింగములఁ జిమ్ముచునూతనధూమరాజి యా
తనికి ధనంజయాభిధను తథ్యముగా నొనరించె నత్తఱిన్. ౧౭

ఉ. నారదమౌనివర్యవదనంబున వెల్వడువాక్కులన్ మహా
భారము గొన్న యర్జునతపంబు దయాంబుధి శంకరుండు సొం
పారఁగ విన్చు నుండ, జగదంబిక యానఘఁ గన్నుసన్న వా
వీకునిఁ జూడ నిచ్చ ప్రభవించెను నందు నెఱుంగఁ జేసినన్. ౧౮

గీ. సర్వమంగళ కెంతయుసంతసంబు
కలుఁగఁ జేయఁగ మనమునఁ దలఁచి శివుఁడు

ఈయ నెంచియు ఫల్గుణాభీష్ట మపుడ
వేడ్క ధరియించె లుబ్ధుని వేషంబు ౧౯

సీ. ధరియించి రాదిమదంపతుల్ మాయాకి
రాతవేషంబులు ప్రీతితోడ
తిలకంబు దిద్దిరి ద్విపవదనాంచిత
గణనాథకరటపంకంబుతోడ
జడకుచ్చు గట్టిరి స్కందవాహనశిఖి
పింఛంబు పించుక ప్రియులఁ జేసి
తాల్చిరి కటిని మందాకినీనిమ్నగా
తీరవృక్షచ్ఛదచీరములను

గీ. ఎఱుకసానియు మఱియు నాయెఱుకఱేఁడు
విల్లు నమ్ములఁ దాల్చిరి వెరపు మిగుల
పూని ధరియించి రమ్ములపొదులఁ గటిని
స్వీయపరికరబంధంబు సిద్ధి నొంద. ౨౦

గీ. పరపురుషుఁ డిట్లు శబరత్వధరుఁడు గాఁగ
మొదటివర్ణంబు శశిఖండపదముఁ దొఱఁగి
చయ్య నొరుఁ జేరఁ బరుఁ డంత శబరుఁ డయ్యెఁ
బాలిచెను శిఖండ మై శిరోభూషణంబు ౨౧

ఉ. తోడనె రాజతాచలము తొయ్యలితోడ హరుండు వీడ, వీ
డేడకుఁ బోవువారో యిటు లెక్కటి నందుచు సంశయించియున్
వేడుక మీఱఁగా శబరవేషములన్ ధరియించి గ్రక్కునన్
గూడిరి వారలన్ బ్రమథకూటము లొండొరు మీఱ సందడిన్. ౨౨

సీ. తోఁకల నిట్టటు త్రుళ్లింపఁ జేయుచుఁ
బలు తెఱంగులఁ గానఁ బరుగులిడుచు
దూరచారశ్రమ తోరమై పొడమిన
నలసట మేనెల్ల నలయఁ జేయ

ప్రేలెడు నాల్కల లాలాజలంబులు
జాలువాఱఁగ వనసరణి నెంతొ
స్వచ్ఛతరంబుగా నలుపుదు; ధృఢతర
శ్వానంబులను దేహచలన మొప్పఁ
గీ. బొదలఁ జొచ్చియు మృగముల వెదకి వెదకి
హుంకరించుచు బీరంబు పొంక మమర
విశ్వనిగమము లనియెడి వేఁటకుక్క
లిరుగెలంకులఁ దవులుచుఁ దెరలె నపుడు. ౨౩
క. కరభూషణముగఁ దాల్చిన
హరిణకిశోరంబె మృగసమాకర్షణకై
వెర వగుదీపకమృగగతిఁ
గర మొప్పఁగ వెంట నంటి కానఁగవచ్చెన్. ౨౪
చ. జననియు శంకరుండు హిమశైలదరీపథ మంటి రాఁగ, గ్ర
క్కున వనదేవతాతతి కోమలకల్పకపల్లవంబులన్
ననలను జల్లి, ఘోరతుహినంబున వారల కించుకేని వే
దన గలుగంగ నీక ప్రమదంబునఁ గొల్చెను మార్గమెల్లెడన్. ౨౫
ఉ. ఎక్కడివార లీయొక లెన్నఁడు పూర్వ మెఱుంగరారు; వీ
రక్కట మాయరణ్య మిటు లాక్రమణం బొనరింప నేకత
మ్మొక్కొ యటం చునాయకవినోదక్రిరాతులు రోస మెక్కఁగా
నొక్కుమొగిన్ సమాగతుల నుక్కడఁగింపఁ గడంగి రత్తఱిన్. ౨౬
గీ. శంకరునిదివ్యతేజఃప్రసారకలన
శబరయువకుల యుత్సాహసరణి యంత
చల్లనయ్యెను; గుండెలు జల్లు రనఁగఁ
జూచుచుండిరి వారలు చోద్య మంది. ౨౭
సీ. మానవరేణ్యు లామాయాకిరాతుల
వేడబంబులఁ గాంచి వెఱఁగు నంది

మార్గమధ్యమున విమానవేగము నాఁపి
భక్త్యతిరేకంబు పల్లవింప
ప్రీతి జటావల్లరీమూలపల్లవం
బుల నంజలిపుటంబు లలవరించి
హర్షాశ్రుసమ్మిశ్రితానిలంబులతోడ
జయజయశబ్దముల్ జడిగొనంగ
గీ. తలరి యాజగదాదిమదంపతులును
నియమమేర్పడఁ దపమును నిర్వహించు
నాసునాశీరసుతతపోవాసభూమి
నడుగు లిడఁగఁ దొడంగి రత్యంతప్రీతి ౨౮
చ. శ్రవణమునందు వ్రేలఁబడు సారతరంబగు పత్త్రమాలికన్
దవులుట ఱెక్కలాడినవిధంబునఁ బొల్చెడి బాణపంక్తి వా
శివునిశరీరమం దడరఁజేసెను; లింగమయస్వరూపుపై
నవసుమపుంజముం గురిసెనా? యనుభాతి దలిర్ప నత్తఱిన్. ౨౯
శా. పాదాగ్రంబుల నంటి వ్రేలెడుజటాభారంబు బంధించి, న
మ్మోదం బొప్పఁగ నాతపమ్మె యశనమ్ముం గాఁ దపోవృత్తిని
ష్ఠాదక్షత్వము నూని యుంట గతదోస్సారున్ బృథాసూనుఁ బ్రే
మాదార్యంబులఁ జూచునాయుమకుఁ బ్రౌత్సుక్య మొప్పెం గడున్.
ఉ. అంతట భూమిభాగము ఖురాగ్రములం జదియంగ మెట్టుచున్
వింత దలిర్పు రోసమున వేమఱు ఘుంకృతి సల్పుచున్ మహా
ద్ధాంతశరీరవైకృతిని దాల్చినకోలము ఫల్గునాశ్రమో
పాంతమునన్ భయంకరవిహారము సల్పఁ గడంగె నత్తఱిన్. ౩౧
చ. భయదవిహారముం గొని విభాసిలునాకిటిఁ జూచునంతనే
రయమునఁ గృష్ణశాబనికరం బటు వల్కలమందు డాఁగ, వ్రేఁ
గయినగళస్వనంబుల విహంగమపంక్తి భయంబు దెల్పినన్
నియమము నుజ్జగించి వెస నించెను జేతఁ గిరీటి చాపమున్. ౩౨

గీ. ముఖర మహానట్టు గుణమును మొరయఁజేసి
వీరహానియుఁ గిటి నేఁడు వెడలునంత
ప్రమాచరులు వెంట నంటఁగా శబరుఁ డొకఁడు
ధనువు నెక్కిడి లేఁటుముచుఁ గనఁగ వచ్చె. 33

చ "విడువకు బాణ మోరి కిటి వెంబడి నే నిటు చాలప్రొద్దుగా
నడుగక వచ్చుచుంటి" నని యుద్ధతిఁ బల్కు కిరాతు పల్కులన్
పెడచెవిఁ బెట్టుచుం బరిభవించినగర్వము మీఱ నాకిటిన్
వడిఁ దెగనేసె నస్త్రముల ఫల్గునుఁ డంత సఫల్గుసారుఁ డై. 3౪

ఉ. ఆసమయుంబునందె శివుఁ డస్త్రము నేసె శివార్జునాస్త్రవి
న్యాసము నేకకాలమున నక్కిటిదేహము నొవ్వఁదుప్పి పే
రాసను దానియాయువు సమాంశముగా భుజియించె; సోదరుల్
కాసును పీసమైన జనకద్రవిణంబు భుజించుకై వడిన్. 3౫

క. శబరునివచనములను వినఁ
బ్రబలం బగురోష మంతరంగము గలఁపన్
తబిసి యగువిజయుఁ డదలో
నిబిడం బగుశాంతిఁ బూని నేర్పునఁ బలికెన్. 3౬

సీ. నాయధికారంబు నాఁటి యున్నట్టియా
యాశ్రమంబునఁ గోల మనుగ పెట్ట
కాంచినయంతనే కడఁకమైఁ జేసితి
శరపాతమునకు లక్ష్యంబు గాఁగ
వీరుఁడ నైనన న్వీఱిఁడిగా నెంచి
యవహేలనము సేయు నదరి తీవు
అమ్ము నమ్మాటకు నమ్ము నీ వుద్ధతి
బాణముల్ దీనిపైఁ బఱపినావు

గీ. శాపదానముననొ లేక చాపముననొ
నీమ్రత్తు లెంత యడఁగింప నేర్పు గలదు

అయిన నోర్చితిఁ దపమున నణఁగియుంట
నలవి మీఱిననిజభుజోష్మలతఁ దలఁచి. ౩౭

క. ఈరీతిఁ బల్కు నాఖుని
వీరుని దర్పప్రవాహవేశిన్. వాణిన్
మేరుధనుర్ధారియు విని
స్మేరముఖాబ్జమున సొగసు చిందఁగఁ బలికెన్. ౩౮

చ. తెలుపుచునుండె నీపలుకె తేటగ నీదగుబుద్ధిమార్దవం
బెలసి శరణ్యసీమఁ బరిహింపని మెట్టలు చేయఁగొంట కే
వలము స్వధర్మ మాశబరవర్యుల కానో? తపఃక్రియావ్రత
స్థలకగునో? యెఱుంగు మది సూక్ష్మముగాఁ బరికించి నిష్ఠుడిన్ ౩౯

క. స్వకులాచారంబును విడు
వక మెలఁగెడినాకు నీతపంబునవలెనే
వికటాచారము సల్పియుఁ
బ్రకటించెద వౌర! నీపరాక్రమకీర్తుల్. ౪౦

చ. విపినమునందు జంతువుల వేఁటలఁ జంపఁగఁ గద్దెఁగట్టు నీ
తపమున శుద్ధి యెంతో విశద మ్మగు; దాని నటుండనిమ్ము; నే
రుపు వెలయంగ నీమృగము రూపఱఁ జేసెడివేళ నాశర
ప్రపతన మూఁతఁ గొన్ననిజబాహుబలంబును దెల్ల మెల్లెడన్. ౪౧

చ. పరుషవచఃప్రసారమున భర్గుఁడు నాతనిఁ జేరఁ బిల్చి, యే
మిర! శరణమ్ము వేఁడు నను, మీఱఁగఁ బోకుము; నాదు పేర్మి కీ
వరయఁగ నెంతవాఁడ; వవురా! నయనమ్మున నే నొకింత నేఁ
డరుణిమ దాల్తునేని భయమందెడుఁ జువ్వె కృతాంతుఁడేనియున్ ౪౨

క. శంకరుఁ డీగతిఁ బలికె న
హంకారము మీఱ; నంత నర్జునుఁ డెద సా
తంకత నిష్ఠురవచనం
బంకురితముఁ జేసె సాహసాంకత మెఱయన్. ౪౩

ఉ. ఓరి వనేచరాపసద! యుద్ధతి చూపెదు నానమత్సమం
దారు! యిటుల్ త్వదీయులకు హర్షము సంధిలఁ బల్కుచుంటి వే
వారయు వైతివే మగఁడనో! యక్కట మక్కువ నీకి రాతి సొం
పారఁగ మక్కువత్తుఁ జెవియాకులుఁ దాల్పఁ దలంపు లేదొకో? ౪౪

ఉ. వీనులఁ గాల్పఁ బట్టికురువీరుని వాక్కులు విన్నయంత లో
నూని యమర్షమం బ్రమథయోధులు చంపఁగఁ బూని రాతనిం
గాని, దయార్ద్రచిత్త యగు గౌరిముఖంబునఁ జింతలాకునా
లేనగవుం గనంగఁ బెకలించిన యమ్ములఁ దాల్చి రట్టులన్. ౪౫

గీ. భిల్లమల్లుఁడు కురువంశవల్లభుండు
ఫుల్లభల్లంబులను శల్యపల్లవముల
దేవతలదృష్టి బ్రసరింపఁ దెరువు నిడని
సమర మతిభయంకరముగ జరిపి రపుడు. ౪౬

ఉ. రోస మొకింత దాల్చినటు రుద్రుఁడు గానఁగ వచ్చి, వేగ ని
ష్ప్రాసము ముట్ట, గౌరమనమం దొకయింతుక శంకఁ బూని, యా
వాసవసూతికి న్నొడ సభంగురమంగళవృద్ధిఁ గోరి, పే
రానఁ బఠించె నా యుమ తము 'యాతఇషు'శ్శ్రుతి నెమ్మనంబునన్ ౪౭

చ. నరగ ధనుర్గుణంబు దృఢసారతఁ గర్ణముదాఁక లాగి శం
కరుఁడు దయామయాంబునిధి గావున నింద్రతనూజు మేనిపై
శరములు కొన్ని వైచె; నరసం బది తాఁకియుఁ దాఁకనట్టి వా
వెరవున, కొన్ని లక్ష్యమును వీడియుఁ జన్నవిధంబు తోఁపగన్. ౪౮

ఉ. అమ్ములు వమ్ముపోవ నెద నర్జునుఁ డబ్బుర మందుచు న్నిమం
గమ్ములపొమ్ము గొల్పడినఁ గ్రచ్చఱ నీసున నాయగాత్మజా
నమ్ముఖమందె శంకరుని జాపముతో శిరమందు వ్రేసె వే
గమ్మున నా ప్రణమ్మ శశిఖండనఖత్వము దాల్పఁబట్టగాన్. ౪౯

గీ. చాపమున మోఁదఁబడిన యాశ్వరునిమౌళి
తలమునుండి తొలంగురక్తాంబుకణము

లోలి భూమిని వ్రాలె నత్యుజ్జ్వలముగ
ఫణిఫణామణు లుర్విపైఁ బడెడుభంగి. ౫౦

ఉ. అజగమేలుతండ్రి హరుఁ డర్జునచాపము వ్రేటు నంది, ని
ర్వ్యాజముగా మనంబునఁ గరంబు వహించినహర్షవార్ధి నే
తోజను బోలదమ్మ; మును హుంకృతిమీఱ గజాస్యుఁ డొప్పి వి
భ్రాజితలీల గంగదరి వ్రభువిహారము చేయువేడుకల్. ౫౧

సీ. గాండీవ మిదియ మున్ ఖాండవం బేర్చెడి
సమయమం దగ్నికి సాయపడియె
తక్షకునిల్లాండ్రు తరలి నశింపఁగా
ప్రథమకారణ మైనబడియు యిదియ
ఇంద్రుఁ డడ్డము రాఁగ నెట్టునా జోరనీక
వెతలఁ బెట్టినయట్టి విదురుసుమ్ము
పెద్దకాలమునుండి పేర్చినవైరంబు
మనజాతితోడఁ దాల్చినదిసుమ్ము

గీ. అనుచుఁ గ్రోధము దాల్చి యూహారునివహాళి
జడలగుబురున వాసంబు సలుపుచున్న
ఫణులు తటి చూచి దాని భక్షణముసేసె
ననఁగ గాండీవదండంబు నణఁగె నచట. ౫౨

సీ. దైవవిపర్యయం బీవిధిఁ గల్గెనా
అటుగాక ఏనిమాయావిధంబొ
భావింపఁగా రానిపథ మిది యేదియో
తెలియకున్నది నాకుఁ దేటపడఁగ
అంచు నెడంద నొక్కించుక చింతిలి
ధైర్యంబు నంతలోఁ దాల్చి క్రీడి
ఉత్సాహశక్తి లో నుజ్జ్వలమై పొంగ
నీశ్వరు గద్దించి యిట్టు లనియె

గీ. ఎటుల ! మహాత్మ ! నీ వెట కేఁగఁ గలవు
అర్జునునిఁ గూడ నిర్జించి యశము గొనఁగఁ
జాలెదవురా ? యటంచుఁ దర్జనము చేసి
తలపడఁగఁ జొచ్చె బాహుయుద్ధమున కతఁడు. ౫౩

గీ. తపసి, నిష్ఠురతరముష్టితాడనమున
శబరవీరుని వామవక్షమున వ్రీఁచు
నెటుకపానియురంబున వటులనట్టి
తెల్లగురివెందపేరులు త్రెవ్వి పడియె ౫౪

చ. చిరముగ నిత్యుపాసనముఁ జిక్కినయామునివక్షముండు శం
కరుఁడును ముష్టిమూర్ధము గ్రమ్మఁగఁ గ్రమ్మలఁ జేసె వాని, నా
హావున నింద్రసూనుహృదయంబున వాసము గొన్నతన్నఁ దు
ర్భరశరపాతవ్యథలు పాయఁగఁ జేయఁ గడంగెనో యనన్. ౫౫

సీ. ముష్టిప్రహారముల్ ముమ్మరమ్మై చన
నొండొరు మీఱి వా రుదుటుగొనిరి
పెనఁకువల్ పెరుఁగఁగ వనకుసుమపరాగ
భస్మాంగరాగలేపములు గొనిరి
ఒక్కొక్క బాహువు నొప్పఁగా సారించి
జడల నొండొరు నొంపఁ గడఁగి రపుడు
లెక్కసభుజమునఁ దార్కొని యన్యోన్య
గళనాళములు చుట్టఁ గడలుకొనిరి

గీ. శబరవిభుఁడు తపోధనసత్తముఁడును
నొండొరుల మీఱి నుద్ధతి నొనరఁ దాల్చి
సమబలత్వము చెల్ల నాహిమనగంబు
పెద్దచటియును గూలిరి పెలుచ నపుడు. ౫౬

చ. శబరు నధోముఖంబు గొనుచందమునం ధరఁ గూలనేసియున్
బ్రబలి విమోహ మేర్పడఁగఁ బార్థుఁడు నిష్ఠురప్రస్తరస్థలిన్

నిబిడముగాఁ గవుంగిటను నించినచో భ్రమరీస్తనగంబుతోఁ
దబిసిని నన్నుఁ గాచెకికతమ్మున నల్లునిఁ దెల్పఁ గోరునాన్. ౫౭

ఉ. సంగరమందుఁ బార్థునిభుజంబుల నొప్పెడివీర్యరేఖ నా
ర్పం గని శంకరుండు బహుభంగుల విస్మయ మంది మాళిపైఁ
బొంగెడుజాహ్నవీవిమలపూరకణంబుల గంటిమీఁదఁ జే
రం గడపీడ నందియు శిరశ్చలనంబు వహించు వేడ్కమై. ౫౮

గీ. ఈగతిఁ దడవుగ భూమి న
ధోగతుఁ డై యుండి కలఁత దొఱఁగిన సంజ్ఞా
స్వాగతసముదాచారస
మాగమమున నింద్రసూనుఁ డల్లన లేచెన్. ౫౯

ఉ. కన్నుల విప్పిచో నెదుటఁ గానఁగవచ్చెఁ గిరాతుఁడై ప్రభా
భ్యున్నతదివ్యతేజమున నొప్పినశంకరుఁ, డాకిరాతియే
యున్నులమిన్న సర్వజగదంబిక యాగిరిరాజకన్య, యిం
కెన్నఁగ శక్యమే సాటి గదెట్టిగుణజ్ఞుల కైన నయ్యెడన్. ౬౦

ఉ. వీనులవిందుగా నమృతవృష్టిని జిల్కెడుభంగిఁ గంఠగ
ర్జానినదంబుతోఁ బటుకరం బగుఘంటలకాంకృతుల్ మృదు
ధ్వానము లీన లోకదురితంబులు చెందుమహోక్ష మెక్కి శ
ర్వాణికి గూడి శంకరుఁడు వచ్చె నలంకృతసర్పహారుఁ డై. ౬౧

క. పారిషదగణము లంజలి
సారసవన మొదవఁ జేయ సరసత నమున్
గౌరీకాంతుఁడు దివ్యవి
హారముతోఁ బొలుచురాజహంసం బయ్యెన్. ౬౨

సీ. మార్దవసము పేర శార్దూలచర్మంబు
కల్యయనంబుగా పఱుప, మీఁద
వద్దంబుగాఁ జరణాంబుజయుగ్మము
ప్రసరింపఁజేయుచుఁ బ్రక్కఁ జేరి

యాదటనిగాఱ శిలాదకుమారుండు
సంవాహనము ప్రీతిఁ జలుపుచుండ
దర్పము నిగుడ నుల్లిప్లవనంబు చేసెడి
తతి యానమును నాఁటఁ దగినరీతి

గీ. కళము పై ప్రేలుకనకశృంఖలను జేతఁ
బూని యత్యంతమృదుకరపుటముతోడ
కకుదశృంగంబులను మెల్లఁగా నిమురుచుఁ
జెంత మెలఁగెడిశృంగితో నెంతొ యొప్పె. ౬౩

ఉ. శంకరమౌళిసీమ ననిశంబు విభూషణమై తనర్చునే
గాంకుఁడు గాండివాతిశశినాహతి నుక్కఱి సంచుఁ దారకల్
కింక దొలంగ నాప్రియుమికిం దగ నూఱటఁ గూర్ప వ్రాలె న
స్సంక దలిర్పఁ గల్పసుమసంహతివృష్టి దలిర్చి శర్వుపైన్. ౬౪

చ. కడుకొని సారమేయములకందువ నొప్పెడినాల్గువేదముల్
వెడఁగు దలిర్పఁగా నపుడె విశ్రుతపూరువరూప మేర్పడన్
జడలను భస్మమున్ మృదుకుశంబులఁ జీరలఁ జేతఁ దాల్చి యా
మృడుబిరుదంబులన్ స్వరము మించఁగ గానము చేసె నింపుగన్.

ఉ. అంబరవీథి డగ్గఱుచు నబ్బుర మేర్పడఁ జూచి వేడ్కతో
తుంబురముఖ్యవైణికులు తోరముగాఁ దమకీర్తికీర్తిరా
గంబున నామహేశు ననుకంపను భక్తజనాఘరక్షణా
లంబనశక్తిఁ దల్ మృదుకలంబుగఁ బాడిరి భక్తిపెంపునన్. ౬౬

గీ. భూతనాథుఁడు తనశ్రవఃపూరముగను
పాఁపగఁ దాల్చిన తాపింఛకుసుమగుచ్ఛ
మునఁ దొలంగెడి తేనియసోననెపమున
మించుచూపులఁ గృపను వర్షింప నదరె. ౬౭

గీ. అర్జునోన్ముక్తబాణప్రహారజాత
వ్రణము లిట్లంగ మెల్లెడ వఱలె ననఁగ

విమలదీప్తివిలాసంబు వెల్లివిరియ
ఫణిపణారత్నభూమలు పరిఢవించె. ౬౮

క. అవతంసచంద్రరేఖా
స్రవిగళితమయూఖపంక్తిపాతజశైత్యం
బు వహింపఁబనియటు బిఱుతన
గవున హృదంతఃప్రసాదగతి సూచించెన్. ౬౯

ఉ. వాసవి యాదిదేవు మునివంద్యుని శంకరుఁ జూచునంతఁ బ
క్ష్మావరణంబు ద్రోయఁ బటుభారము దాల్చినసమ్మదాశ్రురే
ఖావళి దేహమందుఁ బులకాంకురముల్ వెలయింపఁ బాదప
ద్మావనతుండు నై నతుల నర్పనచేసెను వేనవేలుగన్. ౭౦

శా. స్వామీ! నే నిటు మూఢబుద్ధి నయి నీసామర్థ్యముం గాన కి
ట్లేమేమో వచియించినాఁడ; మనమం దీ సొప్పు వాగ్బాణచా
పామోఘంబులు, ముష్టిపాత మన నా లైచెల్లు నేరంబు ల
త్యామోదం బొలయన్ క్షమించి కనుమయ్యా సన్ దయాంభోనిధీ

ఉ. ఈవిధి విన్నవించి తనమొగ్గున కెంతయు వేఁగునర్జునిన్
దీవన లొప్పఁగాఁ దెలఁచి దేహము నెల్లెడఁ గల్పకల్లవ
శ్రీ వెలయించుహస్తమున జేర్చి వ్రణంబుల మాయఁజేసి, యా
శావసనుండు సజ్జనవశంవదుఁ డిట్టులు పల్కె వానితోన్. ౭౧

గీ. ఆహవోద్ధుర నీదుమూఁడవదిదైన
యింతయపరాధమున నెంత సంతసంబు
గలిగెనో యంతహర్షంబు గలుగ దయ్య
భక్తిఁ దపమునఁ బూజాప్రశస్తికైన ౭౩

ఉ. ఆక్షణమందె శంకరుఁడు నమ్మలు చాపము మున్నుగాఁగఁ దాఁ
గుక్షినిగొన్నవానిఁ, దశఁ గోరినపాశుపతాస్త్ర మష్టప్ర
త్యక్షముగాఁ గిరీటివశ మందఁగఁజేసెను హర్ష మొప్ప, నా
దక్షునిగాండివాహతివిధంబున కిచ్చుబహూకృతిం బలెన్. ౭౪

పాలకురికి సోమనాథకవి జన్మస్థలము

బండారు తమ్మయ్య

పాలకురికి సోమనాథుఁడు నన్నయ తిక్కనల నడిమి కాలమున వెలసిన ప్రఖ్యాతాంధ్రకవి. ఈతఁడు సంస్కృతభాషలో వేదవేదాంగాది సకలవిద్యాపారంగతుం డగుసఖండపండితుఁ డయ్యు గౌతమబుద్ధుఁడు ప్రాకృతమునుబలె మతవాఙ్మయరచనమునకు మాతృభాష యగు తెలుఁగునే ప్రధానసాధనముగ గ్రహించి నిర్వహించినమహనీయుఁడు. తెలుఁగుఁబలుకులను వేదములకొలఁదిగఁ దలపోయుఁ డని తెలుంగు సోదరుల హెచ్చరించి యసదృశనైపుణ్యముతో వేదార్థముల విరివిగ వెసఁ జల్లుకృతులను దేటతెనుఁగున రచించి తెలుంగుఁదల్లిదీవనల వర్ధిల్లిన మురిపెంపుఁగొడుకుఁగుఱ్ఱ. "ఉరుతరగద్యపద్యోక్తులకంటె, సరసమై పరగినజానుతెనుంగు, చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ గూర్చెద ద్విపదలు గోర్కె దైవార" అనియు, "ఆరూఢగద్యపద్యాదిప్రబంధ, పూరితసంస్కృతభూయిష్ఠరచన, మానుగా సర్వసామాన్యంబుగామి, జానుతెనుఁగు విశేషము ప్రసన్నతకు" అనియు లోకమునకుఁ జాటి తాను జానుతెనుఁగురచనము రుచి వలచి యితరుల వలపింపఁ జేసి జాతీయచ్ఛందమగు ద్విపదలోఁ దనప్రధానకావ్యములను వెలయించిన సిద్ధంపుఁ దెలుంగుఁగవి యీతఁడు. ఆంధ్రత్వము నాంధ్రతేజము నాతనిదివ్యశరీరమున మూర్తీభవించి కవితాప్రవాహరూపమున నాతని కృతులయందెల్ల వెల్లివిరిసినది.

పాలసంద్రమునఁ జంద్రుఁడువోలె నీసుకవిసోముఁడు పాలకురికి యను జనపదమున నుదయ మందెను అది యాంధ్రచక్రవర్తుల రాజధానియై యాంధ్రనగరము, ఏకశిలానగరము నని వ్యవహరింపఁబడిన యోరుగంటికిఁ (Modern Warrangal) పండ్రెండుక్రోసుల దూరమున

నేఁటినిజాము రాష్ట్రమున నల్లగొండజిల్లా జనగామ తాలూకాలో నున్నది. పేరిలోఁ గొంత వికృతిని జెంది కొన్నిశతాబ్దులనుండి యిది పాలకుఱితి (పాలకుర్తి) యని గూడ వ్యవహరింపఁబడుచున్నను సోమనాథునికాలమున దీనికిఁ బాలకురికి యనియే వ్యవహారముండినట్లు సోమనాథుని కృతులవలననే విశదము కాఁగలదు. బసవపురాణ, పండితారాధ్యచరిత్రగద్యలలో "సుకృతాత్మపాలకురికిసోమనాథ । సుకవిప్రణీత —" అని యాతఁడు ప్రాసస్థానమునఁ బాలకురికి యనియే వ్రాసి యున్నాఁడు. తన కృతులలోని తక్కినతావులఁ గూడఁ దనయింటిపేరిని పేర్కొనుటలోఁ బాలకురికి లేక పాల్కురికి యనియే యుదాహరించినాఁడు. ఈకవి శిష్యప్రశిష్యుఁడు పిడుపర్తి సోమనాథుఁ డీతని కంకితముగా రచించిన తన పద్యబసవపురాణావతారికలో

చ. అనవద్యశతన్మహామహిమ మూరవితారకమై చెలంగ శ్రీ
బసవపురాణమున్ సకల భక్తకథామణిసూత్రభాతిగా
వెస రచియింపు మీవు కృతిపేస్థలికిం జని నాఁగ భృంగి సం
తసమునఁ బుట్టెఁ బాల్కురికి నామపురీవరసోమనాథుఁడై.

అని యాతనిజన్మస్థలమును బాల్కురికి యనియే పేర్కొనినాఁడు. మనసోమనాథుని మఱియొక శిష్యప్రశిష్యుఁడు (నామము సరిగాఁ దెలియకున్నను నీతఁడుగూడ బహుశః పిడుపర్తివంశ్యుఁడే కాఁదగును) సోమనాథుని కంకితముగా రచించిన యన్యవాదకోలాహలమను సీసశతకములో సోమనాథునినెలవు పాలకురికి యనియే యుదాహరించినాఁడు.

సీ. భవదీయసంబంధ బంధురం బయ్యె నే
భాగ్యంబుచేసెనో పాలకురికి
భవదంఘ్రిపూజనా పరుల కిమ్మయ్యె నే
భాగ్యంబుచేసెనో పాలకురికి

యుష్మదీశ్వరార సంయుక్తమై వెలసె నే
భాగ్యంబుచేసెనో పాలకురికి
యుష్మదీమాత్రమా భ్యస్మతిం జెందె నే
భాగ్యంబుచేసెనో పాలకురికి
గీ. పాలకురికి రెట్టి భాగ్యంబుచేసెనో
నీస్వనామపూర్వనివాసి మయ్యె
నీహితానుషంగ ! యేకామ్రగురుచిత్త
నలినభృంగ ! సోమనాథలింగ !

క్రీ॥ శ॥ 1560 ప్రాంతమునసుండి పిడుపర్తి సోమనాథున కించుక సమకాలీనుఁడయిన తోంటద సిద్ధలింగకవి (విరక్తతోంటదార్యుఁడు) కన్నడమున మనసోమనాథుని చరిత్రమును గూర్చి లిఖించినపాల్కురికి సోమేశ్వరపురాణమను కృతిలో ఆంధ్రదేశమున, శ్రీశైలమున కీశాన్య ప్రదేశమునఁ గొలనుపాకకు సమీపముననున్న పాలకురికిలో సోమనాథుఁడు జన్మించె నని, కొలనుపాకయందు వెలసినశ్రీ సోమేశ్వరస్వామి సేవనమునఁ దలిదండ్రుల కాతఁ డుదయించెనని స్పష్టముగ వ్రాసినాఁడు. ఇట్లు వర్ణింపఁబడినయీపాలకురికిలోఁ గొండపయి నొక శివాలయ మున్నది. అందలి శివలింగమునకు సోమేశ్వరుఁ డనిపేరు. సోమనాథుని పూర్వు లాస్వామికిఁ బారంపర్యముగ వచ్చెడి యర్చకులని తెలియుచున్నది. ఆస్వామివరప్రసాదముననే సోమనాథుఁడు తలిదండ్రుల కుదయించెనని గూడఁ బాలకురికిప్రాంతమున వాడుకలో నున్నది కావునఁ బాలకురికి సోమేశ్వరస్వామిపేరినిబట్టియో, కొలనుపాక సోమేశ్వరస్వామినామమును బట్టియో మనకవిజనకు లాతనికి సోమనాథుఁడని పేరు పెట్టియుందురు. ఆంధ్రులలో గ్రామనామములఁబట్టి గృహనామము లేర్పడుట చాలఁ బరిపాటి. కావునఁ బూర్వోక్తమయిన పాలకురికియను గ్రామమునుబట్టి యింటిపేరును బుధుని జెప్పిన సోమేశ్వరస్వాములఁబట్టి నామమును మనకవివరున కేర్పడెనని తలంపఁ దగును. పలువురు పరిశోధకు లీ

నిర్ణయము నంగీకరించి యున్నారు. కర్ణాటకవిచరిత్రకారులు శ్రీ నరసింహాచార్యులుగారు నిజామురాష్ట్రమందలి పాల్కురికియే సోమనాథుని నెలవని సంభావించిరి. "Kanarese Literature" అను గ్రంథములో E. P. Rice దొరవారు సోమనాథుఁడు గోదావరీప్రాంతమువాఁడను నుద్దేశముతో గోదావరిజిల్లాయందలి పాఁకురికినివాసి యని వ్రాసి యున్నారు. నిజామమండలమున విశేషసంచార మొనర్చి పరిశోధనలు సలిపిన శ్రీ శేషాద్రిరమణకవులుకూడ రౌద్రిసంవత్సరమున ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములో సోమనాథునిఁగూర్చి వ్రాసిన యొక చిన్నవ్యాసములో నాతనినెల వచ్చుటిపాలకురికి యనియే వ్రాసిరి. ఆంధ్రపత్రిక దుందుభి సంవత్సరాదిసంచికలో వ్రాసిన "పాలకురికి సోమనాథకవి" అను వ్యాసములో నేనుకూడఁ బయినిర్ణయమునే చేసి యున్నాను. తరువాత నాంధ్రగ్రంథమాలికలోఁ బ్రకటితమయిన బసవపురాణము పీఠికలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కూడ దీని సంగీకరించిరి. ఆంధ్రులచరిత్ర వ్రాసిన శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు కూడ దీని నామోదించిరి.

ఇట్టి సందర్భములలో శ్రీ డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు పయి నిర్ణయములఁబాగుగ నెఱింగియుండియు, ఆంధ్రగ్రంథమాలికలోఁ బ్రకటితమయిన పండితారాధ్యచరిత్రము (నూత్నముద్రణము) నకుఁ దాము వ్రాసినపీఠికలో నొక వింతపుంతను ద్రొక్కి మైసూరురాష్ట్రమునందలి తుముకూరుజిల్లా తిప్టూరుతాలూకాలోని "హాల్కురికె"యను ఎకారాంతనామగ్రామమును "హాలకురికి" యని యికారాంతముగా గ్రహించి యదియే సోమనాథుని జన్మస్థల మయియుండునను విపరీతవాదమును వెలువరించినారు. దీనికి ముఖ్యకారణములు పూర్వోక్తమయిన పాలకురికికి నేఁటికాలమున నిజాముప్రభుత్వమువారు ప్రకటించిన గ్రామనామములపట్టికలలో "పాలకుర్తి"యనుపేరేగాని "పాలకురికి" యనుపేరు

ప్రకటితము గాకుండుటయు, మైసూరుప్రభుత్వము వారు ప్రకటించిన పట్టికలలో "హాల్కురికె" యను పేరు గానవచ్చుటయు, తెలుఁగునందలి 'ప'వర్ణము కన్నడములో 'హ'వర్ణముగా నుచ్చరింపఁబడుటచే నదియే సోమనాథుఁడు జననమందిన "పాలకురికి" యయియుండునని, "కురికి (కురికె)" ప్రత్యయాంతములగు గ్రామములు కన్నడదేశమునను నాంధ్ర కర్ణాటదేశముల సరిహద్దులనుగాని యాంధ్రదేశమున లేవని, సోమనాథుఁడు కర్ణాటదేశమున జనించినవాఁడగుటచేతనే కర్ణాటకవులు కూడఁ గొంద ఱాతని నుతించుటకుఁ గారణ మని శ్రీ నారాయణరావుగారు భ్రమించి తలంచుటయు నయియున్నవి. గ్రామనామములు ప్రకటితములయిన పట్టిపట్టికలుమాత్రము తిరుగవేసి తక్కిన స్థలసన్నివేశములు, సంగతిసందర్భము లేమియు విచారింపకయే యొకశుద్ధాంధ్రకవినెలవును గర్ణాటదేశమున నిరూపించుటయందలి యసామంజస్యము శ్రీ నారాయణరావుగారిబుద్ధికిఁ దోఁపకుండుట మిక్కిలి యక్కజ మని వేఱ చెప్పనక్కఱలేదు. నిజాముప్రభుత్వమువారి పట్టికలోని "పాలకుర్తి" నేఁడు గూడ నాప్రాంతమునఁ గొందఱచే "పాలకురికి" యనియే వ్యవహరింపఁబడుచున్నది. అచ్చటి సోమేశ్వరస్వామియాలయమందలి ధ్వజస్తంభము పయి "శ్రీపాల్కురికి సోమేశ్వరస్వామి" యని ప్రాచీనలిపిలోఁ జెక్కిన యక్షరములుగానవచ్చును. సోమేశ్వరస్వామియాలయమే గాక సోమనాథుని సమాధిపయిని ప్రతిష్ఠిత మయినసోమనాథలింగము తదాలయము గూడ నీపాలకురికియం దుండి పూజ లొందుచున్నవి. పాలకురికి సోమనాథునిబంధువులు వంశ్యులు నని చెప్పికొనెడివారు, పాలకుర్తియందును దత్పరిసరములందును నిప్పుడుగూడ నివసించుచున్నారు. అచ్చటి సోమేశ్వర, సోమనాథలింగములకు వారే యర్చకత్వము నెఱపుచున్నారు. బసవపురాణావతారికలో "ఖ్యాతిసై సద్భక్తిగల కట్టకూరి, పోతిదేవర పదాంబుజషట్పదుండ" నని సోమనాథుఁడు కట్టకూరి పోతిదేవర యనునాతనిఁ దన గురువులలో నొకనిగాఁ జేర్కొనినాఁడు. ఈ పోతిదేవర

నివాసస్థలమగు కట్టకూరు పాలకురికి సమీపముననే యున్నది. సోమనాథుఁడు తన శిష్యులకు నగ్రహారముగా నిప్పించినట్లు పిడుపర్తి సోమనాథుఁడు పద్యబసవపురాణావతారికలోఁ జేర్కొనిన దోగిపర్తికూడ నీప్రాంతముననే యున్నది. జనుల వాడుకయందు నేఁడు "కుర్తి" యని యేర్పడిన రూపము పూర్వము "కురికి" యను రూపముతోఁ గూడ నుండి ట్లు శాసనప్రమాణములుగూడఁ గలవు. పాలకుర్తి సమీపముననే నేఁడు ఎలకుర్తి, ఊటుకుర్తి యను పేళ్లతో వ్యవహరింపఁబడుగ్రామములు పదిరెండు, పదిమూఁడు శతాబ్దులనాఁటి శాసనములలో "ఎలకురికి" ఊటుకురికి యను రూపములతోనే వాడఁబడి యున్నవి.

కాకతిరుద్రదేవునినాఁటి ధర్మసాగరము శాసనము (నాలుగవవైపు ౧౨, ౧౩, ౧౪ పంక్తులు).

"రెండుపాడ్లు ఎలుకుర్కి ప్రసన్నవిశ్వేశ్వరదేవరకు సమర్పించినసందుల విసిరోగము భోగమువారు"

కాకతి గణపతిదేవునినాఁటి కొండిపర్తిశాసనము (శా. శ. ౧౧౩౬) తూర్పువయిపు 38-40 పంక్తులు.

"శ్రీ చౌండ సైన్యపతిరారపీంసు తారం గ్రామం సమగ్రమత ... ...న్నఊకుర్కిసంజ్ఞం ... ..."

(తెలంగాణా శాసనములు)

ఈవిషయముల నెల్ల శ్రీ నారాయణరావుగారు పండితారాధ్య చరిత్రపీఠిక వ్రాయునప్పటికి బాగుగా గుర్తించియున్నచో వారీవింతనిర్ణయమునకుఁ బూనుకొనియుండరనియే విశ్వసించెదను.

పిడుపర్తి సోమనాథుఁడు పద్యబసవపురాణావతారికలో నొకనాఁడోరుగంటిలో స్వయంభూదేవుని యాలయమున భక్తులు పాలకురికి సోమనాథునిబసవపురాణమును జదువుచుండఁగాఁ గాకతిప్రతాపరుద్రుఁ డచ్చటికి వచ్చె ననియు నాతఁ డదియేమని ప్రశ్నింపఁగా ధూర్తవిప్రుఁ

డొకఁడు పాలకురికి సోమపతితుఁడు ప్రాసవల్లు వెట్టియప్రమాణముగా నూతనముగ రచించిన ద్విపదబసవపురాణమని చెప్పి నిందింప భక్తులీవార్త సోమనాథునియొద్ద కేఁగి విన్నవింపఁగా నతఁడు ప్రతివాదుల జయింప నోరుగంటి కేతెంచి మహిమలు ప్రదర్శించి శత్రులకుఁ దలవంపులు ఘటించి ప్రతాపరుద్రుని పూజల గ్రహించెనని వ్రాసియున్నాఁడు. ఏకామ్రనాథుని ప్రతాపచరిత్రము, తుమ్మలపల్లి నాగభూషణకవి బసవవిజయమునందుఁగూడ నీకథ యుగ్గడింపఁబడినది. సోమనాథుని నిలవు పాలకురికి యోరుగంటిప్రాంతమున నున్నప్పుడే యిట్టికార్య మాదివసములలో జరిగియుండుట కవుపుగా నుండునుగాని మైసూరురాష్ట్రస్థమగు "హాల్కురికె" యందు సోమనాథుఁ డున్నచో నట్టిది జరగియుండదు. కావున నన్నివిధములఁ జూచినను నిజామురాష్ట్రమునందలి పాలకురికియే సోమనాథుని జన్మస్థల మని నిస్సంశయముగ నిర్ణయింపనగును.

మైసూరురాజ్యమందలి హాల్కురికెయందు సోమనాథసంబంధికములగు సన్నివేశము లొక్కటియుఁ గానరావు. ఉన్నట్లు శ్రీనారాయణరావుగారైనను జెప్పనేరరు. అది శుద్ధకర్ణాటదేశము. పూర్వము వర్తకమునకయి వలసవచ్చినకొన్ని వైశ్యకుటుంబములవారు మాత్రము వచ్చియు రాని వికృతపుఁదెలుఁగు మాట్లాడుట గాని యచ్చట నేఁడు తెలుఁగుబాస మాటాడువారే లేరని తెలియుచున్నది. ఇప్పుడు లేకున్నను బూర్వ మచ్చటఁ దెనుఁగువా రుండిరని తెలుఁగుబాస ప్రచారముండెనని శ్రీనారాయణరావుగారు తలంచెడిచో నదివట్టి భ్రమయే యని చెప్పఁదగును. ఆంధ్రదేశపుఁ బొలిమేర యచ్చటి కెనుబది మైళ్ళదూరమునఁ గాని లేదు. సోమనాథునిఁ గర్ణాటకవులు కొందఱు నుతించుటకుఁ గల వాస్తవకారణమును శ్రీ నారాయణరావుగారు గుర్తింపకుండుట శోచనీయము. ఉపలబ్ధములయిన సోమనాథునికృతులలోఁ గేవలము కర్ణాటకృతియని చెప్పఁదగిన సుప్రసిద్ధకావ్య మొకటియుఁ గానరాదు. కర్ణాటకవులయినను నట్టికృతిని దేనిని బేర్కొని యుండలేదు. సోమనాథుని వారు

సన్నుతించుటకుఁ గలప్రధానకారణ మాతఁడు పుట్టుకచేఁ గర్ణాటుఁడును కర్ణాటకావ్యకర్తయై ప్రసిద్ధి నొందియుండుటగాదు. మఱి కర్ణాటదేశీయుఁడు, వీరశైవమతోద్ధారకుఁడునగు బసవేశ్వరుని చరిత్రమును మహిమాదికములను దొలుదొలుతఁ దనమాతృభాషయగు తెలుఁగున వెలయించి తెలుఁగువారికిఁ గన్నడులకుఁ గూడ నేకరీతిగ నుపకరించు బసవస్తోత్రము లనేకములు రచించి, సోమనాథుఁడు బసవపురాణమును బసవస్తవములను గన్నడమునఁ గూడ వెలయించుటకుఁ దమకు మార్గదర్శకుఁడయిన మహనీయుఁడనియే యాతనియెడ భక్తిని బ్రదర్శించి కర్ణాటకవులు గొంద అందునను ముఖ్యముగ వీరశైవులుమాత్రమే యాతనిఁ దమకృతులలోఁ బ్రశంసించిరి.

శ్రీ నారాయణరావుగారి యీనూత్నవాదమును విభూతిపత్త్రికాధిపతులు శ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మగారు విభూతి సం 2 సం 1 యందును, "బసవపురాణము; తత్కృతివిశేషములు" (విభూతి సం 4 సం 1) అనువ్యాసమున శ్రీ శేషాద్రి రమణకవులును విమర్శించి యున్నారు. ఇతరత్ర మఱికొందఱుగూడ దానిని నిరసించిరి. శ్రీనారాయణరావుగా రిందులో వేనికిఁ దగుసమాధానము లొసంగక శ్రీవీరభద్రశర్మగారికి నివేదనపూర్వకముగ భారతి సం 20 సం 7 లో "పాల్కురికి" యను శీర్షికతో నొకచిన్న లేఖనుమాత్రము ప్రకటించిరి. దానిలోఁ దమ "హాలకురికి" వాదము కేవలము నూత్న మనియు, పాల్కురికి గ్రామనామవిచారమే క్రొత్తదనియు సత్యమని తోఁచుటచేతనే దానిని బ్రకటించితిమనియు, హాల్కురికియందు జనించినను సోమనాథుని శైవమతప్రచారము శ్రీశైలము, ఓరుగల్లుప్రాంతముల జరిగినదని తాము కూడ నంగీకరించితి మనియు, హాలకురికిప్రాంతమున నిప్పుడు తెలుఁగుభాష విశేషవ్యవహారములో లేకున్నను బూర్వ ముండియుండు ననియు, హాలకురికె ప్రాంతకన్నడశాసనములలో "పాల్కురికె" యని తెలుఁగు

శాసనములలోఁ బాల్కురికి యని పేర్కొనఁబడిన దనియు వ్రాసి యట్టి శాసనప్రమాణము మాత్ర మొకటియు నుదాహరింపరయిరి. ఇంతతో నూరకొనక పాలకుర్తియే పాలకురికి యను నిశ్చితవాదమును మొదటఁ బ్రవేశ పెట్టినది నే ననియు నామాటలందలి విశ్వాసము చే వానిని సమర్థించుటకయి శ్రీవీరభద్రశర్మగారు తమ పాలకురికివాదమును ఖండించుటకయి ప్రయత్నించి రని కూఁగూడ శ్రీ నారాయణరావుగారు వ్రాసి యున్నారు. ఇవి కేవలము సాహసవాక్యము లని తెలుపుటకు విచారమగుచున్నది. ఓరుగంటి ప్రాంతముననున్న సోమనాథుని పాలకురికి నేఁడు పాలకుర్తి యని నిజాము రాష్ట్రమున వ్యవహరింపఁబడుచున్నట్లు ఆంధ్రపత్రిక దుందుభిసంవత్సరాదిసంచికలో సోమనాథునిఁగూర్చి వ్యాసము వ్రాయునప్పటికి నాకుఁ దెలియనే తెలియదు. అటుతరువాత నే దాని నే నెఱింగితిని. ఏకామ్రనాథుని ప్రతాపచరిత్రములో "పాలకుర్తి" "పాలకుర్తి సోమనాథుఁ" డనియే యున్నది. కావునఁ బాలకురికికి "పాలకుర్తి" యను వ్యవహారము నూతనముగఁ గాక కొన్నిశతాబ్దులక్రిందటనే యేర్పడి యున్నట్లు తలంప నగును.

క్రీ. శ. 1500 ప్రాంతముననున్న తోంటదార్యుఁడు, పిడుపర్తి సోమనాథుఁడు మొదలుకొని నేటిదనుక నాంధ్రకర్ణాటకవులు నాధునిక విమర్శకులు ఓరుగంటిప్రాంతమందలి పాలకురికి (పాలకుర్తి) నే సోమనాథుని నెలవుగా సంభావించి యున్నట్టు లింతకుముందే వివరించియుంటిని. ఇట్టి పరిస్థితులలో సత్యమును గప్పిపుచ్చి శ్రీ నారాయణరావుగారు పాలకుర్తియే పాలకురికియను నిశ్చితవాదమును లేవనెత్తినది నేనే యని వ్రాయుట యెంతిఘోరసాహసమో విజ్ఞులకుఁ జెప్ప నవసరము లేదు. ఇప్పటివఱకుఁ దామొక్కరు దక్క మ ఱెవ్వరయిన పాల్కురికిని సోమనాథుని జన్మస్థలముగా నెంచినట్లు శ్రీనారాయణరావుగారు చూపఁగల్గినచో జోహారులు. తమది కేవలము నూత్నవాద మని తామే చెప్పికొనుచు నిట్టి యసంగతవాక్యములు వ్రాయుటలోఁ బ్రయోజనమేమి? తృతీయపంథగా నొక నూత్నవాదమును బ్రకటించు నభిలాషముతోడనే నామిత్రులు శ్రీ నారాయణరావుగారు ఏకారాఁటిరూపము నికారాంత

ముగా మార్చి క్రొత్తగా హాల్కురికి వాదమును వెలువరించినట్లు విజ్ఞులు గ్రహింపక పోరు.

హాల్కురికె యేశాసనమం దయినను పాల్కురికె యనిగాని పాల్కురికి యనిగాని వ్యవహరింపఁబడినను నది శ్రీనారాయణరావుగారి వాదమున కుపకరింపఁజాలదు. ఏకనామముగల గ్రామములు భిన్నభిన్న దేశములలో మండలములలో నిప్పుడుగూడ ననేకములు గానవగును. కొన్ని యెడల నొక్క జిల్లాలో నొక్కతాలూకాలోనేకూడ నిట్టి యేకనామక గ్రామములు గానవచ్చును. కావునపాలకురికియను గ్రామములు వేర్వేఱుతావులఁ గానవచ్చినను వాస్తవముగా వానిలో నేది సోమనాథుని జన్మస్థలమో శృంగగ్రాహికా న్యాయమున నిర్ణయించి నిరూపించుటయే చరిత్రజ్ఞుల కర్తవ్యము స్థలసన్నివేశాదిసామగ్రిచే నోరుగంటి ప్రాంతమందలి పాలకురికి (పాలకుర్తి) నే యట్లు నిరూపించుటకు వలసినన్ని యవకాశము లున్నవి.

శ్రీ వీరభద్రశర్మగారు పూర్వోక్తమయిన "హాల్కురికె"ను 22-3-43 తేదిని స్వయముగా సందర్శించి యచ్చటి విశేషములఁ గూర్చి వారి పూర్వోక్తవిమర్శనానంతరము విభూతి సం. 4 సం. 7-8-9 లో "హాల్కురికె" యను శీర్షికతో మఱియొక వ్యాసమును బ్రకటించియున్నారు. దానిని జదివిన వారికి శ్రీ నారాయణరావుగారి వాదమందలి యసామంజస్యము మఱింత వ్యక్తము కాఁగలదు. ఈ గ్రామము తాలూకా గ్రామమగు తిపటూరునకుఁ దొమ్మిదిమైళ్లదూరమున నున్నది. అచ్చట రమారమి నాలుగునూఱులు గృహములును వేయిమంది జనులును గలరు. జనసంఖ్యలో ముక్కాలువీరశైవులు. వారి యందఱభాషయుఁ గన్నడమే. అచ్చటి జనులలో వీరశైవులకుఁగూడ నెవరికిఁ బాల్కురికి సోమనాథునిపేరైన నెఱుంగరాదఁట. గ్రామమున రెండువందలయేండ్ల క్రిందట నిర్మింపఁబడిన శివాలయ మొక్కటియే కలదు. ఫలహారేశ్వర, రుద్రదేవర, భైరవేశ్వర యనునామములుగల మూఁడుమూర్తు లాదేవళమునఁ గలరు. అనఁగా సోమనాథుని కాలమునాఁటి దచ్చట శివాలయ మైనను లేదు.

ఈగ్రామము శా. శ. ౧౪౬౮ సంవత్సరములో వీరసదాశివరాయలవారిపక్షమున రామరాయలచే మాధ్వసంప్రదాయాచార్యులగు సోసలెవ్యాసరాయస్వాములవారి కగ్రహారముగా నీయఁబడినట్లు లోక మాధ్వమఠమున కెదురుగానున్న కన్నడశిలాశాసనములో నున్నది. అందు గ్రామనామము పాల్కురికె యనియే యున్నట్లు తెలియుచున్నది. కురికె యను ఎకారాంతరూపములు కన్నడదేశమునను, కురికి యను ఇకారాంతరూపము లాంధ్రదేశమునను వ్యవహృతము లయినట్లు దీనినిబట్టి గ్రహింప నగును

పరమపూజ్యుఁడగు సోమనాథుని జన్మస్థానమగు పాలకురికి యాంధ్రభాషాభిమానుల కెల్లఁ బూజ్యపద మగునొక దివ్యక్షేత్రమై యలరారుచున్నది. హైదరాబాదు వైపునుండి వచ్చువారు జనగాంస్టేషనువద్దను బెజవాడవైపునుండి వచ్చువారు ఘనపురము (Ghanpur) స్టేషను వద్దను దిగి యైదారుమైళ్లు మోటారుమీఁదను, తరువాత రమారమి పదునేను మైళ్లు రెండెడ్ల బండిమీఁదను ప్రయాణము చేసి పాలకురికిని జేరవచ్చును. నేఁడిది చిన్నగ్రామ మైనను "కొంచెమైన నదియుఁ గొదవ గాదు" అను వేమనసూక్తికిఁ దావలమై క్షేత్రమహాత్త్వమున గొప్పదిగనే గణింపఁబడుచున్నది. అచ్చటి కొండపై నున్న సోమేశ్వరస్వామి దేవాలయమునుండి చూచినచో రెండుమైళ్ల దూరములో మహాకవి పోతనామాత్యుని జన్మస్థానమగు బమ్మెరగ్రామముగూడఁ గానవచ్చును. సోమేశ్వరస్వామియెదుట శిల్పకళాసంపదకాలయమగు ప్రాచీన నీలనందీశ్వరవిగ్రహము గూడఁగలదు. మహాశివరాత్రి కేఁటేఁట నిచ్చట గొప్పయుత్సవము జరుగును. అప్పుడాయుత్సవములో యాత్రికులు "పాలకుర్తి నిలయా! సోమయలింగా! పాదములకు శరణు! ఉరవుగ బమ్మెర పోతరాజుకు మీరు కోరినవరములు కృపచేసినారఁట! పాలకుర్తి నిలయా" అను పాటను బాడుచుందురు. దీనినిబట్టి సోమేశ్వరస్వామి పోతనామాత్యునకుఁ గూడ నిష్టదైవముగా నుండె నని మనము గ్రహింపనగును. ఆంధ్రదేశమునెల్ల భక్తిరసప్రవాహమున నోలలాడించు నిరువురు సుప్రసిద్ధమహాకవులను బ్రసాదించిన యీసోమేశ్వరస్వామిని సందర్శించి సంసేవించుట యాంధ్రమహాశయుల కత్యంతావశ్యకము.

సోమేశ్వరాలయ మున్నకొండకుఁ దూర్పునఁ గొంతసమీపమున నే సోమనాథకవి సమాధిగలదు. దానిపై సోమనాథలింగము ప్రతిష్ఠింపఁబడి చిన్నగుడి యొకటి నిర్మింపఁబడి యున్నది. దీనినిసోమనాథాలయమనియు సోమనారాధ్యాలయ మనియు వ్యవహరింతురు. ఈయాలయమున ధ్వజస్తంభము నొద్ద జడలు, రుద్రాక్షలు, హృదయభాగమున హస్తాంబుజద్వయముతోఁ బూజించు శివలింగము గలశిలావిగ్రహ మొకటి కలదు. దాని దిగువను ప్రాఁత లిపిలోఁ బేరుకూడ లిఖింపఁబడి మిక్కిలి యరిగిపోవుటచే సరిగాఁ దెలియక "సో, నా," అను రెండక్షరములు మాత్రము పోల్పఁదగి యున్నవి. ఇది సోమనాథకవి విగ్రహమే యని గుర్తింపఁదగును. సోమనాథలింగము విశేషమహిమాన్వితమై భక్తులకు, విపన్నులకు, రోగగ్రస్తులకుఁ గామ్యార్థులకు యాత్రారంగమై యొప్పుచున్నది. చుట్టుప్రక్కలఁ బది యిరువదామడల దూరమునుండి నిచ్చలు నిచ్చటికి యాత్రికు లరుదెంచు చుందురు. వారియుపయోగమునకై యాలయసమీపమున పది, పదునేను ధర్మశాలలుకూడ నిర్మింపఁబడి యున్నవి. ఇచ్చటిరోగనివారణాదిక మహిమలకు సోమనాథుని యంత్రపురశ్చరణ, అష్టదిగ్బంధము మొదలగు క్రియాసిద్ధులు కారణము లని చెప్పుదురు.

సోమేశ్వరస్వామి యాలయమున్న కొండక్రింది సానువులలో పెద్దతేనెపట్టులు ముప్పదిమూఁడు నిత్యము ప్రత్యక్ష మగుచుండును. ఆలయమున కెవరైన నశుచిగా వచ్చినచో నచ్చటి తేనెటీఁగలు వారిపై దాడివెడలి కొంతదూరము తరుగిడినను విడిచిపెట్టవు. కాని సోమనాథాలయము సన్నిధికిమాత్రము వెళ్లుచో నచ్చటికవి ప్రవేశింపఁ జాలవు. ఇట్లు పెక్కు మహిమలతోఁ గూడిన సోమేశ్వర, సోమనాథలింగముల సందర్శించుటకయి యాంధ్రభాషాభిమానులు జన్మమున నొకపరియైనఁ బాలకురికియాత్ర గావించి ధన్యులయ్యెదరుగాక !

సరియైన పరిశోధనము నన్వేషణము జరిగినచో నీపాలకురికియందును దత్ప్రాంతమునను నలభ్యములగు సోమనాథుని కృతులును నితర చారిత్రక సామగ్రియుఁ గూడ లభింపఁ గలవని తలంపఁదగును.

దర్శనసమీక్ష.

సాహిత్యశిరోమణి, భాషాప్రవీణ, చిలుకూరి వీరభద్రశాస్త్రి.

'దర్శన' శబ్దమునకుఁ బ్రకరణవశమున నాయాస్థలముల భిన్నార్థము లున్నను నీప్రస్తావమునఁ 'దృశ్యతే జ్ఞాయతే ఆత్మా అనేన' యను వ్యుత్పత్తిచేఁ జేతనవస్తువులవిషయమగు విమర్శనమే ప్రధానముగాఁగల యాగమము (శాస్త్రము) అను నర్థమును గ్రహింపవలయును.

దర్శనముల సంఖ్యానిర్ణయమునుగుఱించి పెద్దలు పలువిధములగు నభిప్రాయభేదములను బ్రకటించియున్నారు. కొందఱు ౧. పూర్వమీమాంస ౨. ఉత్తరమీమాంస, 3. సేశ్వరసాంఖ్యము ౪. నిరీశ్వరసాంఖ్యము, ౫. సప్తపదార్థాభిధాయిన్యాయము (వైశేషికము) ౬. షోడశపదార్థాభిధాయిన్యాయము (నైయాయికము) అను నీయాఱిటిని షడ్దర్శనములుగా నంగీకరించిరి. ఈక్రిందిశ్లోకము దాని కుపష్టంభకము.

శ్లో. కపిలస్య కణాదస్య గౌతమస్య పతంజలేః,
వ్యాసస్య జైమినేశ్చాపి శాస్త్రాణ్యాహుః షడేవహి.

ఇఁకఁ గొందఱు 1. మీమాంసాదర్శనము, 2. సాంఖ్యదర్శనము, 3. న్యాయదర్శనము, 4. బౌద్ధదర్శనము, 5. జైనదర్శనము, 6. చార్వాకదర్శనము, అనువానిని షడ్దర్శనములుగా నంగీకరించిరి.

మఱికొందఱు (బౌద్ధాంతర్గత) 1. సౌత్రాంతిక, 2. వైభాషిక, 3. యోగాచార, 4. మాధ్యమిక, 5. జైన, 6. లౌకాయతికము, లనెడి యాఱుదర్శనములును, 1. పూర్వమీమాంస, 2. ఉత్తరమీమాంస, 3. సేశ్వరశాంఖ్య, 4. నిరీశ్వరశాంఖ్య, 5. న్యాయ, 6. వైశేషికము లనియెడి యాఱుదర్శనములును గలిపి ద్వాదశదర్శనములుగా నంగీకరించిరి.

౧. చార్వాకము ౨ జైనము 3. వైభాషికము ౪. సౌత్రాంతికము ౫. యోగాచారము ౬. మాధ్యమికము ౭. నైయాయికము ౮. వైశేషికము ౯. పాశుపతము ౧౦ సాంఖ్యము ౧౧. యోగము ౧౨. భాట్టము. ౧౩. ప్రాభాకరము ౧౪. మాయావాదము ౧౫. భాస్కరీయము ౧౬. యాదవము ౧౭. ఏకాయన (మాధ్వము) ౧౮. విశిష్టాద్వైతము, అని దర్శనములను పదునెనిమిదిగా నుగ్గడించువారును గలరు.

శ్రీసాయణ మాధవాచార్యులు, 1. చార్వాకదర్శనము, 2. బౌద్ధదర్శనము, 3. ఆర్హతదర్శనము, 4 రామానుజదర్శనము, 5. పూర్ణప్రజ్ఞదర్శనము, 6 నకులీశపాశుపతదర్శనము, 7. శైవదర్శనము, 8. ప్రత్యభిజ్ఞాదర్శనము, 9. రసేశ్వరదర్శనము, 10. ఔలూక్యదర్శనము, 11. అక్షపాదదర్శనము, 12. జైమినిదర్శనము, 13. పాణినిదర్శనము, 14 సాంఖ్యదర్శనము, 15. పాతంజలదర్శనము, 16. శాంకరదర్శనము, నని దర్శనసంఖ్యావిషయమై పదునాఱుగా నిరూపించియున్నారు. వీనితోపాటు బౌద్ధమునఁగల 1. మాధ్యమిక, 2. యోగాచార, 3. సౌత్రాంతిక, 4. వైభాషిక, మను భేదచతుష్టయమును గ్రహించితిమేని పందొమ్మిది దర్శనము లగును

సాధారణముగ దర్శనములు రెండు తెఱఁగులుగాఁ గన్పట్టుచున్నవి. (జీవునకు నీశ్వరునకు) అభేదమును దెల్పునవియు, భేదమును దెల్పునవియు నని. వీనిలో నభేదప్రతిపాదకత్వమున నగ్రస్థానమును వహించినది శాంకరదర్శనము పాణినిదర్శనమును, అభేదప్రతిపాదక మనియే పెద్దలయుద్ఘోషము

శ్లో. వాచ్యా సా సర్వశబ్దానాం శబ్దాచ్చ నపృథక్తతః
అపృథక్త్వేఽపి సంబంధ స్తయో ర్జీవాత్మనోరివ.

వాచ్యవాచకముల (పదపదార్థముల) కభేదము నిత్యమయినను వానికిసంబంధము (భేదము) కేవలము కల్పింపఁబడినదగుటచే నది జీవా

త్మపరమాత్మల కభేదము సత్య మయియున్నను వ్యవహార కాలమునఁ గల్పనావశము చేఁ గలిగినసంబంధము (భేదము) వలె స్థిరము కానేరదు.

శ్లో. తస్మాచ్ఛక్తివిభాగేన సత్యః సర్వః సదాత్మకః
ఏకో౽ర్థః శబ్దవాచ్యత్వే బహురూపః ప్రకాశతే.
శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి.

ఇటు లీదర్శన మభేదప్రతిపాదక మయినటులనే మీమాంసా (పూర్వమీమాంసా) దర్శనముగూడ నభేదమును దెలుపును. కావునఁ బైనఁజెప్పినరీతిని శాంకర పాణినీయ మీమాంసా దర్శనములు మూఁడు నభేదప్రతిపాదకములు. మిగిలిన దర్శనము లన్నియు (జీవేశ్వరులకు) భేదమును దెలుపునవి.

ఏదర్శనము లభేదమును జెప్పునో యయ్యవి 'శ్రౌత'ములని చెప్ప నగును. శ్రుతులనే ప్రధానప్రమాణముగాఁ గొని వస్తుయథార్థస్వరూపమును బ్రతిపాదించునవి 'శ్రౌతములు'. ఏదర్శనములు భేదమును దెలుపునో యయ్యవి 'తార్కికములు'. ప్రధానముగాఁ దర్కము (ఊహ-అనుమానము)నే యాధారముగాఁగొని వస్తుస్వరూపమును వెదకునవి 'తార్కికములు'.

వేఱొకరీతిని 'నాస్తికము'లనియు 'ఆస్తికము'లనియు దర్శనములు రెండువిధములు. దైవము, పరలోకము, మున్నగునవి లేవనియెడివాదమును దెలుపునవి 'నాస్తికములు'. అవి యున్న వని తెలుపునవి 'ఆస్తికములు'. దర్శనములలో చార్వాకము, భేదచతుష్టయముతోఁగూడిన బౌద్ధము, ఆర్హతము (జైనము) ననునవి నాస్తికదర్శనములు. మిగిలిన పదుమూఁడును ఆస్తికములు.

బ్రహ్మ మొదలిడి స్తంబపర్యంతముగల సమస్తప్రాణిజాతము సహజముగా ననిష్టమును దొలంగి యిష్టమును బొందుట కిచ్ఛగించు ననుట యెల్ల రెఱిఁగినదియే. ఇయ్యదిదర్శనకర్తల కెల్లరకుసమ్మతిపాత్రము.

అం దిష్టతమ మాత్యంతికసుఖము. అయ్యదియె మోక్షము. అదిజ్ఞానము చేతనే సాధింపఁదగినది. 'జ్ఞానాదేవహి కైవల్య'మ్మనియభియుక్తోక్తిగదా. 'నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే' యనిగీతలో జ్ఞానమాహాత్మ్యమును కృష్ణభగవానుఁ డుద్ఘోషించియున్నాఁడు. లోకమునం దొక్కొకటి జ్ఞాని పెక్కుయత్నములు సల్పియు సాధింపఁజాలని ప్రయోజనమును మందుఁడు సైతము ధనముకలిమి ననాయాసమున సాధింపఁగల్గును. అంతమాత్రమున కాతఁడు జ్ఞానికంటె నధికుఁ డనఁజెల్లదు. ద్రవ్యము నేదియో యొకయుపాయముచే మనుజుఁడు సాధింపఁ గలుగును జ్ఞానము మాత్ర మట్టిది కానేరదు.

కావుననే కరదీకృతసకలసామంతమండలుఁడును, ఐశ్వర్యశిఖరారూఢుఁడును, ఏకాదశాక్షౌహిణీయుతుఁడును నగుసుయోధనుఁడు పరాభూతుఁ డగుటయు, రాజ్యభ్రష్టులయ్యుఁ బదుమూఁడువత్సరము లీవనమునంది యాపదలకుఁ గ్రుమ్మరుచు నవయు పాండవులు తమజ్ఞానముచే సంతోషితకృష్ణులయి తత్సాహాయ్యముకల్మిఁ దుదిగెలుపు గొనుటయుఁ బై విషయమునకు దృష్టాంతము. ద్రవ్య మున్నచో బుద్ధికి సాహాయ్యకారి యగునుగాని జ్ఞానముకంటె దానికిఁ బ్రాధాన్యము లేదనువిషయము సార్వజనీనము. తత్త్వవిషయకమగు ఆత్మానాత్మ విషయకమగు తెలివియే 'జ్ఞాన' మనఁబడును, 'తస్య భావ స్తత్త్వ' మనువ్యుత్పత్తిచే వస్తువునకుఁ గలయథార్థస్వరూపమే 'తత్త్వ' మనఁ బడును. వస్తుతత్త్వజ్ఞానమే మోక్షోపయోగి. కావున దీనిని దెలియుట మోక్షము (ఆత్యంతిక సుఖము) నకుయుక్తమో యయ్యది 'తత్త్వ'మని మన లోకలక్షణము తెలియుచున్నది. అట్టి తత్త్వములను దెలిసికొనుటవలనఁ గలిగెడు దుఃఖాసంవలితసుఖము (మోక్షము) ఆయాయిదర్శనకర్తల ప్రతిభావిశేషముల నాశ్రయించి ప్రతిదర్శనమునందు భిన్నముగాఁ జూపట్టుచున్నది. దర్శనకర్తలు వేఱగుటవలన, వారు చూపెడిసుఖావస్థ, దానికి సాధన

మనస్స్థానము, జ్ఞానమూలమగు తత్త్వములు వేఱుగాఁ గన్పట్టుచున్నవి. అందుచే దర్శనములుగూడ భిన్నముగా నేర్పడినవి.

ఇట నానాసర్వదర్శనములందుఁ గలవిషయము, స్వరూపము, మొదలగునవి సంక్షేపముగా నాతెలిసినకొలఁది వివరించుచుంటిని.

చార్వాకదర్శనము.

నాస్తికాగ్రేసరుఁడగు చార్వాకునిచే రచింపఁబడిన దర్శనము చార్వాకదర్శనము. వీరిమతమున- త్వగింద్రియముచే మృదుత్వ, కఠినము, శీతము, ఉష్ణము మొదలగు సుఖభావములు పొందుట; జిహ్వచే కారము, పులుసు, తీపి మొదలగు రసములానుట; ఘ్రాణేంద్రియముచే కస్తూరి, కుంకుమ మొదలగు పరిమళద్రవ్యములయందుఁ గల సౌరభము ఘ్రాణించుట; నేత్రములచే ఘటము, పటము, స్తంభము, అంభోరుహము మొదలగు స్థావరాదిజంగమాంతపదార్థములను జూచుట; శ్రవణేంద్రియముచే వీణావాదము, స్త్రీగీతము మున్నగుమధురధ్వనులు వినుట; వీనివలనఁ గలుగునో యట్టి ప్రత్యక్ష మొక్కఁడే ప్రమాణము. అనుమానము, శబ్దము మొదలగు ప్రమాణము లపరిమితములు. అప్రత్యక్షమగు పరలోకము వీరి కక్కఱలేదు. వేదచోదితధర్మ మసమ్మతము. పుణ్యమనగా సుఖము. పాపము దుఃఖము. అనుమానప్రమాణముచే సాధింపఁదగిన యీశ్వరుఁడును లేఁడు. లోకమునఁ గన్నుల కెదురుగఁ గన్పడు మహీశ్వరుఁడే యీశ్వరుఁడు. దేహమే యాత్మ. దేహపాతమే మోక్షము. లలితకాంతాలింగనాది విషయోపభోగమే పురుషార్థము. ముల్లు గ్రుచ్చుకొనుట మున్నగువానివలనఁ గలుగు దుఃఖమే నరకము.

కావున నెల్లరు ఖాద్యా ఖాద్య, గమ్యా, గమ్య, సేవ్యా సేవ్య వివేకము లుజ్జగించి తమకుఁ దగినరీతిని యథేచ్ఛముగా విషయసుఖము సంపాదించుకొనవలయును ననునది యీమతమందలి సారాంశము.

శ్లో. యావజ్జీవేత్ సుఖం జీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్,
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః.

ఈమతము వినసవ్వుకు వీనుల కింపుగాఁ గన్పట్టినను దుదికి దుఃఖావహమగుటచేతను, పెద్దలచే నంగీకరింపఁబడనిదగుటచేతను గ్రాహ్యము కాదు.

శ్లో. న స్వర్గో నైవ జన్మాద్యపి న నరకో నాప్యధర్మో నధర్మః
కర్తా నైవాస్య కశ్చిత్ ప్రభవతి జగతో నైవ భర్తా న హర్తా
ప్రత్యక్షాన్య న్న మానం న సకలఫలభుక్ దేహభిన్నోఽస్తి కశ్చిత్
మిథ్యాభూతే సమస్తే వ్యనుభవతి జన స్సర్వ మేతద్ధి మోహాత్.

బౌద్ధదర్శనము.

బుద్ధదేవు ననుసరించువారు బౌద్ధులు. వారు రచించిన దర్శనము బౌద్ధదర్శనము. వీరు 1 మాధ్యమికులు, 2 యోగాచారులు, 3 సౌత్రాంతికులు, 4 వైభాషికులు, అని నాలుగు తెఱఁగుల వారు. అందు—

మాధ్యమికులు.

మొదట బుద్ధదేవుఁడు తనశిష్యులకు 'సర్వము శూన్యము' అని యుపదేశము చేయ నెవరు గురూపదిష్టమగు సర్వశూన్యత్వమును సత్యముగా నమ్మి యింక నేమియు నడుగరైరో వారు మధ్యమబుద్ధి కలవారగుటచే 'మాధ్యమికు' లనఁ బరగిరి. వీరిది క్షణికవాదము. ప్రతివస్తువు క్షణమాత్రమేనిలుచును. కావున చిరస్థాయికాదు. ప్రతివస్తువు దుఃఖము నిచ్చునదియే కావున ననుకూల (వేదనీయ)ము కాదు. ప్రతివస్తువునకు దాని కున్న రూపమే లక్షణము. కావున సామాన్యముగా నుండు (అనఁగా బ్రాహ్మణుఁడని తెలిసికొనవలయునన్న శిఖాయజ్ఞోపవీతములు బ్రాహ్మణు నెఱింగించును. అగ్నిహోత్రుని తెలిసికొన వలయునన్న కాల్చువాఁడు, వేఁడిగా నుండువాఁ డగ్నిహోత్రుఁ డనుగుర్తుచేఁదెలియనగును.) లక్షణ ముండనేరదు. ప్రపంచమంతయు శూన్యము. (ఏమియు లేదు.) కావున నేవస్తువు సత్యముకాదు. ఇటులు బుద్ధోపదిష్టమగు శూన్యత్వము నవలంబించినవారగుటచే వీరలు 'సర్వశూన్యవాదులు'.